**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 27 జూన్, 2021.**

## కృష్ణా జలాలపై రెండు తెలుగు రాష్ట్రాలు సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలి
## రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలి

**- సిపిఐ(యం) డిమాండ్**

వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతానికి అదనంగా తాగునీరు, సాగునీరు, ఇవ్వడం లక్ష్యంగా శ్రీశైలం ప్రాజెక్టు నుండి వరద రోజుల్లో ప్రస్తుతం ఉన్న 44వేల క్యూసెక్కులకు తోడుగా మరో 44 వేల క్యూసెక్కులకు నీటిని తరలించాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రకటించింది. ఇంత ముఖ్యమైన నిర్ణయం చేయడానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఉండాల్సింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. కృష్ణానదిలో ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఆంధ్ర, తెలంగాణాలకు మిగులు జలాలు కాదు కదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలు కూడా గ్యారెంటీ ఉండదు.

రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణా జలాలలో తమ వాటాగా ఉన్న నికర జలాలకు గ్యారంటీని పొందాలి. అలాగే బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును కాపాడుకోవాలి. ఈ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు పెట్టి శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తి పోస్తామని ప్రకటించటంతో రాయలసీమకు నీళ్లు రాకముందే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి తగాదాలను పెంచింది.

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ప్రారంభించిన పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, తుంగభద్రపై తుమ్మిళ్ల వద్ద ఎత్తిపోతల పథకంలతో పాటు ఆలంపూర్ వద్ద బ్యారేజ్ కట్టి పైపుల ద్వారా నీటిని తీసుకువెళతామని కల్వకుర్తి పంపు సామర్థ్యాన్ని పెంచి అదనంగా నీటిని తరలిస్తామని, పులిచింతల ప్రాజెక్టు వెనుక నుండి 2 లక్షల ఎకరాలకు నీరు తీసుకుపోతామని తెలంగాణ క్యాబినెట్ తీర్మానం చేయడం జరిగింది. ఇది రెండు రాష్ట్రాల మధ్య నీటి తగాదాలు మరింత జటిలం చేసింది. ఈ సందర్భంలోనే కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లా పడమట ప్రాంతానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన నాలుగు టీఎంసీల నీటికి వ్యతిరేకంగా తెలంగాణలో ఆందోళనలు ప్రారంభం కావడం దురదృష్టకరం.

సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ వాటా జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా నీటి వివాదాలను పరిష్కరించుకోవాలని భావోద్వేగాలు పెంచే వైఖరితో వ్యవహరించరాదని సిపిఎం కోరుతున్నది. రాయలసీమతో సహా వెనుకబడిన ప్రాంతాలకు న్యాయం జరగాలి. అలాగే తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలకు నీరు అందాలి. కృష్ణా, గోదావరి నదుల జలాలను సమగ్రంగా వినియోగించుకోగలిగితే రెండు రాష్ట్రాల సాగునీటి అవసరాలకు తగినంత నీరు లభ్యమవుతుందని మార్క్సిస్టు పార్టీ భావిస్తున్నది. ఈ రెండు రాష్ట్రాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా ఈ వివాదాన్ని పరిష్కరించుకొని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ(యం) కోరుతున్నది.

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి